కథ

# విష్వక్సేనుడు ఐ.ఏ.యస్.

డా॥ పోరంకి సీతారామ ప్రసాద్

పట్టువదలని విక్రమార్కుని వలె ఏడవసారి కలెక్టర్ ఆఫీస్ మెట్లు ఎక్కాడు డెబ్బయి ఆరు సంవత్సరాల జానకిరామయ్య. ఆ నాలుగు మెట్లు ఎక్కేసరికి ఆయాసం ముంచుకు రావడంతో అక్కడే ఉన్న బెంచి మీద చతికిలపడి కండువాతో ముఖం మీద చెమటను తుడుచుకొన్నాడు. అయిదు నిముషాలు ఆగి జి–5 సెక్షన్‌లోకి వెళ్ళాడు. అప్పుడు సమయం మధ్యాహ్నం రెండు గంటలయింది. గుమస్తా ఫైల్స్ సర్దుకుంటున్నాడు.‘‘నమస్కారం సార్! కలెక్టర్ గారికి నా విన్నపం...’’

‘‘ఏ విన్నపం?’’ ఒక ముసలాయనను కూర్చోమని చెప్పకుండా నిలబెట్టే అడిగాడు గుమస్తా.



‘‘అదే సార్! ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ మీకు గుర్తు చేస్తూనే ఉన్నాను. నా పేరు జానకిరామయ్య. రిటైర్డ్ గవర్నమెంట్ టీచర్‌ని. పెన్షనర్‌ని. గుండె ఆపరేషన్ చేయించుకొన్నాను. మెడికల్ రీ ఎం బర్స్‌మెంట్ రావాలి. మొత్తం అరవై ఎనిమిది వేలు. ఆ డబ్బు శాంక్షన్ అయింది. బిల్‌పాస్ ఆర్డర్ వేయడానికి సబ్ ట్రెజరీ ఆఫీసర్ అయిదు వేలు లంచం అడుగుతున్నారు. కలెక్టర్ గారి జోక్యం అర్థిస్తూ విన్నపం రాసి సమర్పించుకొని నెల రోజులు అయింది... ఆ విషయం...’’

‘‘ఆ! ఆ! గుర్తుకొచ్చింది. కొత్త కలెక్టర్ గారు నిన్ననే జాయిన్ అయ్యారు. ముఖ్యమైన ఫైల్స్ కేంప్ క్లర్క్ వద్ద చాలా పెండింగ్‌లో ఉన్నాయి. వారం, పది రోజులు పోయాక కనపడండి’’.

‘‘అప్పుడేనా నా విన్నపం పరిశీలించేలా చూడండి సార్! దయచేసి’’.

‘‘విన్నపం.. విన్నపం... చంపేస్తున్నావయ్యా! ముందు ఇక్కడినుంచి కదులు. కొత్త కలెక్టర్ గారు చాలా స్ట్రిక్ట్... విజిటర్స్‌ని సెక్షన్‌లో చూస్తే మా పని గోవిందా! చెప్పాను గదా! పది హేను రోజులు పోయాక రా!’’

‘‘ఇప్పుడే కదా! వారం.. పది రోజులు అన్నారు..’’

‘‘అంటానయ్యా. ఇప్పుడు నెల రోజులు అంటాను. ముందు ఇక్కడ నుంచి కదలవయ్యా స్వామీ!’’

జానకిరామయ్య మనస్సు చివుక్కుమంది. ‘ఒక టీచర్‌కు దక్కే గౌరవం ఇదేనా?’ అని ‘కాదు’ అని కొద్దిసేపట్లో కాలం నిరూపించబోతోంది.

జానకిరామయ్య నిస్సత్తువగా కాళ్ళీడ్చుకుంటూ బయటకు నడిచాడు. కలెక్టరాఫీసు నుంచి మెయిన్ గేట్ వరకు అర ఫర్లాంగ్ దూరం సిమెంట్ రోడ్డు ఉంది. దారి పొడవునా రెండు వైపులా ఎర్రని పూల తురాయిచెట్లు. అక్కడక్కడ సిమెంట్ సోఫాలు జానకిరామయ్య నడవలేక పోతున్నాడు. ఆయాసం వస్తోంది. కాస్సేపు ఆగడం మంచిదని ఒక సిమెంట్ సోఫాలో కూర్చుని కళ్ళు మూసుకొన్నాడు. అప్పుడే ఒక తెల్ల అంబాసిడర్ కారు మెయిన్ గేట్‌లోంచి దూసుకొని వచ్చి ఆయన ముందు నుంచి వెళ్ళి, రివర్సు గేర్‌లో వెనక్కి వచ్చి ఆగింది. కారు వెనుక

Story



సీటులోని వ్యక్తి పరిశీలనగా జానకిరామయ్యను చూసాడు. ఆ వ్యక్తి ముఖంలో చెప్పలేని ఆనందం. వెంటనే కారు దిగి జానకిరామయ్య ముందు నిలబడ్డాడు.

''నమస్కారం మేష్టారూ! బాగున్నారా?''

జానకిరామయ్య కళ్ళు తెరిచాడు. కళ్ళు మసకగా ఉన్నట్లున్నాయి. ఎదురుగా ఉన్న వ్యక్తి సరిగ్గా కనిపించలేదు. జానకిరామయ్య కళ్ళు నులుముకొని చూసాడు. ఎదురుగా తెల్లనిసూటులో పొడవుగా బంగారు ఛాయలో ఒక వ్యక్తి.

''నేను మేష్టారూ! సుబ్రహ్మణ్యంని. మీ దగ్గర చదువుకొన్నాను'' ఆ వ్యక్తి వంగి జానకిరామయ్య కాళ్ళకు నమస్కరించాడు.

''సుబ్రహ్మణ్యమా?...'' ఆలోచించాడు. గుర్తుకు రాలేదు.

''గుర్తుకు రావడం లేదు బాబూ!'' ఆ వ్యక్తి నవ్వేసాడు.

''నో ప్రాబ్లమ్. 'క్లూ' ఇస్తే గుర్తుకు వస్తాను. ఆ సంగతి తర్వాత చూద్దాం. ఈలోగా నన్ను గుర్తు పట్టడానికి ప్రయత్నించండి... అవునూ! ఇలా వచ్చారేం?''

''కలెక్టర్ ఆఫీసులో పని ఉండి...''

''అయిందా మాష్టారు?''

''లేదు బాబూ! వాయిదాలు వేస్తూ తిప్పుతున్నారు. ఇంతకూ మీకు ఇక్కడ ఏం పని?''

''నా ఉద్యోగమే ఇక్కడ మాష్టారూ! నేను ఈ జిల్లా కలెక్టర్‌ని. నాతోరండి. మీ పని ఏమిటో చూద్దాం.'' డవాలా బంట్రోతు ఆశ్చర్యంగా ఇదంతా చూస్తున్నాడు. జిల్లా కలెక్టర్ సుబ్రహ్మణ్యం జానకిరామయ్య చేయి పట్టుకొని కారు ఎక్కించాడు. దారిలో జానకిరామయ్య తన సమస్య ఏమిటో వివరించాడు. కారు కలెక్టరాఫీసు పోర్టికోలో ఆగింది.

జిల్లా కలెక్టర్, జానకిరామయ్యను చెయ్యి పట్టుకొని ఆఫీసు మెట్లు ఎక్కించాడు. ''నా ఛాంబర్ మొదటి అంతస్తులో ఉంది. మెట్లు ఎక్కి వెళ్ళాలి. వెళ్దామా?'' కలెక్టర్ అడిగాడు.

''మెట్లు ఎక్కలేను బాబూ! ఆయాసం...''

''నో ప్రాబ్లమ్. మీకోసం నా ఆఫీసే క్రిందకు వస్తుంది రండి'' నవ్వుతూ మెట్ల పక్కనే ఉన్న సెక్షన్ లోకి దారితీసాడు. కలెక్టర్ గారు ఒక ముసలాయనతో సెక్షన్‌లోకి రావడం చూసి సెక్షన్ సూపరింటెండెంటూ, గుమస్తాలు కంగారు పడి లేచి నిలబడ్డారు. లోనికి వచ్చిన వారిద్దరికీ రెండు మెత్తని కుర్చీలు వేయబడ్డాయి. టేబుల్ అమర్చారు. ఎయిర్‌కూలర్ తెచ్చి పెట్టారు. రెండు గ్లాసుల ఐస్ వాటర్, ఆ వెంటనే కెటిల్‌తో కాఫీ వచ్చింది. పై అంతస్తులో ఉన్న కేంప్ క్లర్కుకు రమ్మనమని ఆదేశం వెళ్ళింది.

''జి-5 సెక్షన్ ఇన్‌చార్జిని పిలుపు'' డవాలా బంట్రోతుకు కలెక్టర్ ఆదేశం. మరుక్షణంలో ఇన్‌చార్జి ప్రత్యక్షం.

''నెల రోజుల క్రితం ఈ మేష్టారు మీ కొక అర్జీ ఇచ్చారు. అవునా?''

''చిత్తం. ఇచ్చారండి. ఇప్పుడే తెస్తాను''.

''అవసరం లేదు... మీకు వచ్చిన అర్జీకి వారం రోజులు

లోగా సమాధానం ఇవ్వాల్సి ఉండగా... మీరు ఎందుకు పుటప్ చెయ్యలేదు?''

''చిత్తం... అది... అది నసుగుతున్నాడు ఇన్‌చార్జి.

''నీకిదే ఫస్ట్ అండ్ లాస్ట్ వార్నింగ్.. రిపీట్ అయితే డిసిప్లినరీ ఏక్షన్ తీసుకుంటాను. నీ సీటులోకి పోయి పెండింగ్‌లో ఉన్న అర్జీలన్నీ రేపు సాయంత్రంలోగా పుటప్ చెయ్యి. యూ కెన్ గో'' చావు తప్పి కన్ను లొట్ట పోయినందుకు సంతోషిస్తూ జారుకున్నాడు ఇన్‌చార్జి.

కేంప్ క్లర్క్ వచ్చాడు.

''గంగవరం సబ్ ట్రెజరీ ఆఫీసర్ చెక్‌బుక్, ఆఫీసు సీల్సు ఈ మేష్టారి బిల్లుతో సహా అరగంటలో ఇక్కడ ఉండాలి'' కేంప్ క్లర్క్‌కు ఆదేశం. వెంటనే కేంప్ క్లర్క్ కలెక్టర్ గారి ఆదేశాన్ని గంగవరం ఎస్.టి.ఓ.కు ఫోన్ ద్వారా చెప్పడం జరిగింది. ఈలోగా కలెక్టర్ ఇతర ఫైల్స్ చూస్తూ జానకి రామయ్య యోగక్షేమాలు కనుక్కుంటూ మాట్లాడుతున్నాడు. జానకిరామయ్య ఒక వైపు కలెక్టర్‌తో మాట్లాడుతూనే ఈ పాత విద్యార్థి ఎవరు అయి ఉంటాడు? అని తెగ ఆలోచిస్తున్నాడు. అరగంట గడవక ముందే గంగవరం ఎస్.టి.వో. వచ్చాడు.

''నమస్కారం సార్!'' అన్నాడు ఎస్.టి.వో.

''ఈ మాష్టారి మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ బిల్ పాస్ అయిందా?'' అడిగాడు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, ఎస్.టి.వో. వాంగ్మూలాన్ని రికార్డు చెయ్యబోతూ.

''ఎస్ సర్! ఇప్పుడే పాస్ చేసాను''

''అయితే సరే. వెంటనే బిల్‌ను స్టేట్ బ్యాంక్‌కు పంపించి మాష్టారి ఖాతాలో సొమ్ము తక్షణం క్రెడిట్ అయ్యేలా చూడండి''.

''ఎస్ సర్''

''మేష్టారూ ఎస్.టి.వో. మిమ్మల్ని లంచం అడిగారా? ఎంత?''

''అడిగారండీ. అయిదు వేలు'' జానకి రామయ్య బదులు చెప్పాడు.

''అంటే. అది... అది...'' నీళ్ళు నమిలాడు ఎస్.టి.వో.

''అడిగారా? లేదా? సీ... ఎస్.. ఆర్... నో!'' ఉగ్రనరసింహుడయ్యాడు కలెక్టర్.

''ఎస్ సర్! అడిగాను... క్షమించండి''.

''ఇక్కడ సంతకం పెట్టండి'' అన్నాడు కలెక్టర్. జానకిరామయ్య, ఎస్.టి.ఓ. కలెక్టర్ రికార్డుచేసిన వాంగ్మూలాలపై సంతకాలు చేసారు.

''మీరు రేపటి నుంచి మూడు రోజులు మీ ఆఫీస్‌కు వెళ్ళనక్కర లేదు'' ఎస్.టి.వో.తో అన్నాడు కలెక్టర్. ఎస్.టి.వో.కు విషయం అర్థమయింది. విచారంగా ''సార్!'' అని మాత్రం అనగలిగాడు.

''ఎస్! ప్రొసీడింగ్స్ మీకు ఇంటివద్ద అందుతాయి. యూకెన్ గో'' ఎస్.టి.వో ఒక నమస్కారం పెట్టి తల వంచుకుని వెళ్ళిపోయాడు.

కలెక్టర్ వాచీ చూసాడు. అయిదు అయింది.

''మేష్టారూ! మీ పని పూర్తయింది. రండి వెల్దాం. మిమ్మల్ని ఇంటి వద్ద దిగబెడతాను''.

''మీకెందుకు బాబూ శ్రమ... నేను ఆటోలో వెళ్తాను''.

''అదేమిటి మేష్టారూ! మీ యింటికి నేను రావద్దా?... అమ్మచేతి కాఫీ తాగొద్దా'.

కారు జానకిరామయ్య ఇంటికి కారు బయలుదేరింది. దారిలో డవాలా బంట్రోతు ఒక బుట్టెడు ఆపిల్స్ కొని కారులో పెట్టాడు. జానకిరామయ్యకు ఇదంతా ఒక కలలా ఉంది. ఎవరీ కలెక్టర్? తన దగ్గర చదువుకున్నానంటున్నాడు. తన వద్ద కొన్ని వేల మంది విద్యార్థులు చదువుకున్నారు. వారిలో ఇంతనెవరు? ... ఎంత ఆలోచించినా గుర్తుకు రావడం లేదు. అతను క్లూ ఇస్తానంటున్నాడు. 'క్లూ' ఇచ్చినా గుర్తుపట్టలేకపోతే, చాలా బాధ పడతాడు. ఎవరీ పాత విద్యార్థి?... తెగ ఆలోచిస్తున్నాడు. కలెక్టర్, జానకిరామయ్య ఆలోచనలను పసిగట్టి మనస్సులోనే నవ్వుకొంటున్నాడు. ఇంతలో జానకిరామయ్య ఇల్లు వచ్చింది. కలెక్టర్, జానకిరామయ్య కారు దిగి ఇంట్లోకి వెళ్ళారు. డవాలా బంట్రోతు పళ్ళ బుట్ట ఇంట్లో పెట్టి బయట కారు వద్ద నిలబడ్డాడు.

''సావిత్రీ! మన ఇంటికి కలెక్టర్ గారు వచ్చారు. ఇలారా!'' వంటింట్లో ఉన్న భార్యను పిలిచాడు జానకిరామయ్య. ఆవిడ వచ్చి నమస్కారం పెట్టింది. కలెక్టర్ ఆమెను వారిస్తూ ''మీరు నాకు నమస్కారం పెట్టడం ఏమిటమ్మా! మీ అబ్బాయి వెంకటేశ్వర్లు వంటి వాడిని. నన్ను దీవించండి'' వంగి ఆమె కాళ్ళకు నమస్కరించాడు.

''సావిత్రీ! ఈయన నా దగ్గర చదువుకున్నారట. నేను గుర్తుపట్టలేక పోతున్నాను. నువ్వేనా గుర్తు పట్టగలవేమో చూడు'' గుర్తు పట్టే భారాన్ని ఆవిడకు ట్రాన్స్‌ఫర్ చేస్తూ అన్నాడు జానకిరామయ్య. పది నిముషాలు గడిచినా ఆవిడ గుర్తు పట్టలేక పోయింది.

''సరే మేష్టారూ! మీకు ''క్లూ'' ఇచ్చేస్తున్నాను. నేను 'విష్వక్సేనుడిని''. కలెక్టర్ నోటి నుంచి విష్వక్సేనుడు అనే మాట రాగానే మెరుపు మెరిసినట్లు జానకి రామయ్యకు, ఆయన భార్యకు అంతా గుర్తుకు వచ్చింది.

జానకిరామయ్యకు పట్టలేనంత నవ్వు వచ్చింది. ''ఓరి భడవా! నువ్వా!....'' ఆయన కళ్ళలో ఆనందంతో నీళ్ళు తిరిగాయి.

''బాగుంది... బాగుంది విష్వక్సేనుడు ఐ.ఏ.ఎస్ అయ్యాడన్న మాట'' ఆయనకు గతం అంతా కళ్ళ ముందు కదిలింది. 'ముప్ఫయి సంవత్సరాల క్రితం తను అవనిగడ్డలో మేష్టారుగా పనిచేసే రోజుల్లో సుబ్రహ్మణ్యం ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు తన వద్ద చదువుకున్నాడు. తమ అబ్బాయి వెంకటేశ్వర్లు, వీడూ ప్రాణస్నేహితులు. వీడికి విష్వక్సేనుడు అనే పదం పలకడం రాక ఆ పదాన్ని అష్టవంకరలు తిప్పి పలికేవాడు. వీడిచేత ఆ పదాన్ని పదేపదే పలికించి తోటి విద్యార్థులు పొట్ట చెక్కలయ్యేలా నవ్వేవారు. చివరకు 'విష్వక్సేనుడు' వీడి నిక్‌నేమ్ అయింది. వీడి అసలు పేరు ఎవరికీ తెలియకుండా పోయింది. పదవ తరగతిలో రాత్రిళ్లు తన ఇంట్లోనే పడుకో బెట్టుకొని తెల్లవారుజామున నిద్రలేపి చదివించేవాడు. వీడికి ఇంగ్లీషు లెక్కలు సబ్జెక్టులలో మెళకువులు నేర్పి వెంకటేశ్వర్లుతో పాటు టెన్త్‌క్లాస్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చే లాగ తీర్చిదిద్దింది తనే. 'తెల్లవారు జామున నిద్ర లేపుతున్నాననే కోపంతో తన ముక్కు పొడుం (నస్యం) డబ్బాలను మాయం చేసేవాడు–'

కాఫీలు తాగడం పూర్తయింది. కుశల ప్రశ్నలు, యోగక్షేమాలు... అన్నీ పూర్తయ్యాయి. కలెక్టర్ దృష్టి టీపాయ్ మీద ఉన్న నస్యం డబ్బా మీద పడింది. ఆయన మనస్సులో కలిగిన చిలిపి కోర్కెను అణచుకోలేక పోయాడు. కాస్సేపయ్యాక మాష్టారు దంపతుల వద్ద శెలవు తీసుకొని కారు ఎక్కాడు విష్వక్సేనుడు.

ఆ రోజు రాత్రి – కలెక్టర్ గారి బంగళాలో – కలెక్టరు భార్య ఆయన కోటును హేంగర్‌కు తగిలిస్తూ జేబులోని నస్యం డబ్బా చూసి.

''ఇదేమిటండీ'' అంది – ఆశ్చర్యపోతూ.

కలెక్టర్ నవ్వేస్తూ ''అది విష్వక్సేనుడి తీపి గుర్తులే'' అన్నాడు.

అదే సమయంలో – జానకిరామయ్య ఇంట్లో–

జానకిరామయ్య భార్య, ఆయన నస్యం డబ్బా కోసం ఇల్లంతా గాలిస్తోంది. జానకిరామయ్యకు చటుక్కున స్ఫురించింది. ఆయన పెద్దగా నవ్వేస్తూ.

''సావిత్రీ! ఇక వెతకనక్కర లేదు. నా నస్యం డబ్బా విష్వక్సేనుడు ఐ.ఏ.ఎస్ పట్టుకు పోయి ఉంటాడు'' అన్నాడు.

*

చిరునామా:
డా. ఈరంకి సీతారామ ప్రసాద్,
లెక్చరర్ ఇన్ ఎకనామిక్స్ (రిటైర్డ్),
70-7-64 శ్రీ సాయిశుభ,
స్టేట్ బ్యాంక్ కాలనీ వెనుక, కృష్ణనగర్,
కాకినాడ-533 005,
ఫోన్: 0884-2351431, సెల్: 9440285518.

## నమిత బట్టల పిచ్చి

వెండితెర మీద కురచ దుస్తులతో అభిమానులకు కనువిందు చేసే నమితకు విపరీతమైన బట్టల పిచ్చి! నిజజీవితంలో ఒంటినిండా బట్టలు కట్టుకోవడమే ఇష్టమట! ఆఖరికి పాదాలు కూడా కనపడకుండా డ్రస్ చేసుకుంటుందట! ప్రతి నెలా 30 నుంచి 40వేల రూపాయల బట్టలు కొనుగోలు చేస్తుందట! అందులో అన్నీ సంప్రదాయ సిద్ధమైన డ్రస్‌లే! వెండితెర మీద ఎలా ఉన్నా నిజ జీవితంలో మాత్రం నమిత ఫక్తు సంప్రదాయ సిద్ధమైన అమ్మాయి అని పరిశీలకుల అభిప్రాయం.

